మాట్లాడుతున్న ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

సేవాభావంతో వైద్యం అందించాలి

- హాస్పిటళ్ల సమస్యలన్నీ త్వరితగతిన పరిష్కరిస్తాం
- ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు
- ముగిసిన తానాకాన్ 2025 సదస్సు

విద్యానగర్, మే 25: సమాజంలో భగవంతుడి తర్వాత వైద్యుడికే అంత ప్రాధాన్యత ఉందని.. డాక్టర్లు సేవాభావంతో వైద్యం అందించాలని ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కోరారు. ఆదివారం కరీంనగర్‌లోని ప్రతిమ మల్టీప్లెక్స్‌లో తెలంగాణ హాస్పిటల్స్, నర్సింగ్ హోమ్స్, డాక్టర్స్ అసోసియేషన్(తానాకాన్)-2025 రాష్ట్రస్థాయి సదస్సు ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. డాక్టర్ల సేవలను ప్రభుత్వం గుర్తిస్తుందన్నారు. 50 పడకలు, ఆలోపు ఉన్న హాస్పిటళ్ల ఏర్పాటుకు సంబంధించిన అనుమతుల నిబంధనలు కష్టతరంగా ఉన్నాయని, వాటిని సవరించి సడలింపును ఇవ్వాలని వైద్యులు తన దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. ఈ విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు. పేద ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్న రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని స్ట్రీమ్ లైన్ చేస్తామన్నారు. ప్రజలకు విద్య, వైద్యం అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో 14 మంది డాక్టర్లు ఎమ్మెల్యేలుగా ఉన్నారని, వారికి వైద్యుల సమస్యలపై అవగాహన ఉందన్నారు. నిబంధనలు డాక్టర్లను ఇబ్బంది పెట్టేలా ఉండకుండా చూస్తామన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యేలు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, డాక్టర్ సంజయ్ కుమార్, డాక్టర్ పాల్వాయి హరీశ్ బాబు, డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల, సుడా చైర్మన్ కోమటి రెడ్డి నరేందర్‌రెడ్డి, సదస్సు చైర్మన్ డాక్టర్ ఎల గందుల శ్రీనివాస్, కార్యదర్శి డాక్టర్ చాట్ల శ్రీధర్, కోశాధికారి డాక్టర్ బండారి రాజ్ కుమార్, తాన రాష్ట్ర అధ్యక్షుడు అరుణ్ కతారి, ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు ఎనమల్ల నరేశ్, సీనియర్ వైద్యులు జగన్మోహన్‌రావు, రమణాచారి, బి.ఎన్.రావు, చిట్టుమల్ల ప్రదీప్ కుమార్, రంజిత్ కుమార్, అలీం తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పరామర్శ

బొమ్మకల్‌లో గోష్కి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే గంగుల, తదితరులు

కరీంనగర్ రూరల్, మే 25: కరీంనగర్ మండలం బొమ్మకల్ గ్రామంలోని బీఆర్ఎస్ నాయకులు గోష్కి శంకర్, గోష్కి అజయ్ తల్లి లక్ష్మి మృతి చెందగా, ఆదివారం కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పరామర్శించారు. లక్ష్మి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, మాజీ కార్పొరేటర్ ఐలేందర్‌యాదవ్, మహేశ్, నాయకులు కర్ర సూర్యశేఖర్, నేతి రవివర్మ, తోట కిరణ్‌కుమార్, తునిక రాజ్‌కుమార్, అంజి యాదవ్, మిడిదొడ్డి నవీన్‌కుమార్, చేతి చంద్రశేఖర్ తదితరులున్నారు.

జీపీవో పరీక్ష కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్

పరీక్ష హాలులో పరిశీలిస్తున్న కలెక్టర్

కలెక్టరేట్, మే 25: గ్రామ పాలన అధికారుల నియామకం కోసం ఆదివారం నిర్వహించిన పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ పమేలా సత్పతి సందర్శించారు. నగరంలోని సప్తగిరి కాలనీలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష నిర్వహించగా, అభ్యర్థుల కోసం కేంద్రంలో చేపట్టిన ఏర్పాట్లు పరిశీలించారు. పరీక్షకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు, హాజరైన వారి సంఖ్య, వివరాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లావ్యాప్తంగా మొత్తం 189 మంది వీఆర్‌వో, వీఆర్ఏలు జీపీవో పోస్టుల కోసం దరఖాస్తులు చేసుకోగా, 172 మంది పరీక్షకు హాజరయ్యారు. పకడ్బందీగా నిర్వహించిన ఈపరీక్షను అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, ఆర్డీవో కె.మహేశ్వర్ పర్యవేక్షించగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా, ప్రశాంత వాతావరణంలో ముగిసినట్లు కలెక్టరేట్ ఏవో గడ్డం సుధాకర్ తెలిపారు. కలెక్టర్ వెంట నెహ్రూయువకేంద్ర కోఆర్డినేటర్ రాంబాబు, డీపీఎస్‌వో శ్రీనివాస్‌తో పాటు పలువురు అధికారులు ఉన్నారు.

పారిశుధ్య కార్మికులకు నూతన వస్త్రాల వితరణ

హుజూరాబాద్ టౌన్, మే 25: పట్టణానికి చెందిన సామిల్ వ్యాపారి రావుల ప్రభాకర్ తన కుమారుడి వివాహం సందర్భంగా పారిశుధ్య కార్మికులకు నూతన వస్త్రాలు పంపిణీ చేసి ఔదార్యం చాటుకున్నారు. ఆయన కుమారుడు రావుల నాగేంద్ర-తార వివాహ రిసెప్షన్ ఆదివారం వెంకటసాయి గార్డెన్‌లో జరుగగా, పారిశుధ్య కార్మికులను విందుకు ఆహ్వానించి సుమారు 150 మందికి నూతన వస్త్రాలను అందించారు. ఈ సందర్భంగా పలువురు రావుల ప్రభాకర్ దంపతులను అభినందించారు.

ముగిసిన చదరంగ పోటీలు

కొత్తపల్లి, మే 25 : కరీంనగర్ జిల్లా చదరంగ సమాఖ్య ఆధ్వర్యంలో స్థానిక రాంనగర్‌లో రెండు రోజుల పాటు నిర్వహించిన ఉమ్మడి జిల్లా అండర్-17 చదరంగ పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ పోటీల్లో బాలుర విభాగంలో చిట్టుమల్ల కశ్యప్ మొదటిస్థానం, బాలసంకుల అమన్‌రామ్ రెండో స్థానం, అమిరిశెట్టి నిశ్రిత్ మూడో స్థానం సాధించగా, బాలికల విభాగంలో పి. పరిణిత మొదటిస్థానం, కె సాధన రెండో స్థానం, టి మోక్ష మూడో స్థానంలో నిలిచారు. ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు రాష్ట్రస్థాయి చదరంగ పోటీల్లో పాల్గొననున్నారు. పోటీల నిర్వహణలో ఎ. విశ్వనాథ్ ప్రసాద్, ఎ. రాజేంద్రప్రసాద్, ఆర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా సమస్తప్రజానీకానికి, బ్యాంకులకు మరియు ఫైనాన్షియల్ ఇనిస్టిట్యూషన్లకి తెలియజేయునది ఏమనగా, శ్రీ బొమ్మరవేని మల్లేశం, తండ్రి కీ.శే.భూమయ్య, నివాసం: ఇం.నెం.2-4, గుండి గ్రామం, రామడుగు మండలం, కరీంనగర్ జిల్లా గారు, సర్వే నం.752లో ఎ.1-02 గుంటల వ్యవసాయ భూమి గుండిగ్రామం, రామడుగు మండలంలో గలదానిని శ్రీ మాడిశెట్టి అంజయ్య తండ్రి.నాగయ్య గుండి గ్రామం గారినుండి రిజిస్టర్ దస్తావేజు నం. 1307/2011 తేది: 23.05.2011 ద్వారా కొనుగోలు చేసినారు. లోగడ శ్రీ మాడిశెట్టి అంజయ్య మరియు శ్రీ బొమ్మరవేని భూమయ్య గారలు సర్వే నం.752లో ఎ.2-04 గుంటల భూమిని శ్రీ ఇబిక్యాల హనుమాండ్లు మరియు శ్రీ ఎలుగందుల గట్టయ్య గార్లనుండి రిజిస్టర్ దస్తావేజు నం.1661/1995, తేది: 25.07.1995 ద్వారా కొనుగోలు చేసినారు. శ్రీ భూమయ్య గారి మరణాంతరం ఆతని భార్య శ్రీమతి బొమ్మరవేని కొమురమ్మ పేర మార్చడి అయిన ఎ.1-02 గుంటల భూమిని ఆమె కుమారుడైన మల్లేశం గార్కి రిజిస్టర్ దానపత్రము నం. 4206/2020 చేసి యున్నారు. కాని పైన తెలిపిన ఒరిజినల్ రిజిస్టర్ దస్తావేజు నం. 1307/2011 మరియు దస్తావేజు నం 1661/1995 అగ్నిప్రమాదంలో కాలిపోయినందున, రామడుగు పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేయగా, పోలీసువారు అగ్నిప్రమాదంలో సామగ్రులతోపాటు, కొన్ని కాగితములు కాలిపోయినవని సర్టిఫికేటు, తేది 16.01.2015 ద్వారా తెలిపినారు మరియు మండల రెవిన్యూ పరిశీలకులు కూడా గౌ.తహసిల్దార్ రామడుగార్కి అగ్నిప్రమాదం ధృవీకరిస్తూ నివేదిక సమర్పించినారు.శ్రీ బొమ్మరవేని మల్లేశం గారు, నా క్లయింటు యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా, కొత్తపల్లి బ్రాంచ్ వారిని కలిసి పై ఆస్తిని తనఖా పెట్టి ఋణం తీసుకునేందుకు సంప్రదించినారు. కావున రిజిస్టర్ దస్తావేజు నం. 1307/2011 మరియు దస్తావేజు నం.1661/1995 గురించినానీ, పై భూమిపైనాని ఎవరికైనా హక్కులు, ఆక్షేపణలు ఉన్నచో ఈ క్రింది చిరునామాలో (7) రోజులలోగా సంప్రదించగలరు. గడువులోగా ఎలాంటి అభ్యంతరాలు రానిచో, నా క్లయింట్ బ్యాంకు, శ్రీ బొమ్మరవేని మల్లేశంగార్కి ఋణం మంజూరు చేయగలరు. గడువు తదుపరి వచ్చిన ఆక్షేపణలు చెల్లవు.

ఇట్లు: సం/- **లెంకల రాంరెడ్డి**, న్యాయవాది
ఇంటి నెం.2-10-327, జ్యోతినగర్,
కరీంనగర్ సెల్: 9440003286

వానొస్తే.. ఆ కెనాల్‌కు వరదే!

- డీ4 కెనాల్‌తో పొంచిఉన్న ముప్పు
- మన్నెంపల్లి గ్రామస్తులు, మల్లాపూర్ రైతుల తిప్పలు
- తాత్కాలిక మరమ్మతులతో కాలం వెల్లదీస్తున్న అధికారులు

మన్నెంపల్లిలో తెగిన కుంటకు తాత్కాలిక మరమ్మతులు చేయిస్తున్న అధికారులు (ఫైల్)

తిమ్మాపూర్, మే 25: ఆ కెనాల్‌కు రిజర్వాయర్ నుంచి నీళ్లు వదలడం అవసరం లేదు. చిన్న వానొస్తే చాలు.. వరద పొంగిపొర్లి, ఎక్కడోచోట తెగుతున్నది.. మిడ్‌మానేరు కుడికాలువ ద్వారా తోటపల్లి రిజర్వాయర్ నుంచి వస్తున్న డీ4 కెనాల్ పరిస్థితి ఇది. దీనితో మన్నెంపల్లి గ్రామస్తులకు ఎల్లవేళలా ముప్పు పొంచి ఉండడంతో పాటు మల్లాపూర్ శివారులో రైతుల పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతున్నది. ప్రారంభంలో సరైన ప్రణాళిక లేకుండా అధికారులు కాలువ తీయడంతో ఈ పరిస్థితి నెలకొన్నది. కాలువ వల్ల రైతులకు ఎంతో ఉపయోగం ఉన్నప్పటికీ ప్రస్తుతం ప్రజలను, రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నది.

మిడ్‌మానేరు రిజర్వాయర్ కుడికాలువ ద్వారా తోటపల్లి రిజర్వాయర్ నుంచి డీ4కెనాల్ మానకొండూర్, హుస్నాబాద్ నియోజకవర్గాలకు కాళేశ్వరం జలాలను అందిస్తున్నది. చిగురుమామిడి మండలం పీచుపల్లి వద్ద ఈ డీ4కెనాల్ ఉపకాలువ మానకొండూర్ నియోజకవర్గంలోని తిమ్మాపూర్ మండలం మన్నెంపల్లి, మల్లాపూర్, పోరండ్ల, మానకొండూర్ మండలం చంజర్ల తదితర గ్రామాలకు సాగునీరు వెళ్తుంది. ఈ క్రమంలో ఈ ఉపకాలువ సరైన స్థితిలో నిర్మాణం చేపట్టకపోవడంతో వర్షాకాలం వచ్చిందంటే చాలు ఎక్కడోచోట తెగుతూనే ఉంటుంది. ఎత్తు పల్లాలు ఉండడంతో నీళ్లు ఒకేచోట తిరగబడి తెగిపోతున్నది. వర్షం వచ్చినా వరద తాకిడికి తెగుతున్నది. అలాగే సాగునీటిని వదిలినా ఇదే సమస్య ఏర్పడుతున్నది.

తాత్కాలిక మరమ్మతులతోనే మమ

ఇప్పటికే మన్నెంపల్లి గ్రామాన్ని నాలుగైదు సార్లు ఇబ్బందుల పాలుచేసింది. గండి పడి గ్రామాన్ని ముంచెత్తి బీభత్సం సృష్టించింది. ఆ తెగిన చోట అప్పటికప్పుడు తాత్కాలిక నిర్మాణాలు చేసి చేతులు దులుపుకొంటున్న అధికారులు.. శాశ్వత పరిష్కారం చూపెట్టలేదు. మళ్లీ వర్షాకాలం వస్తున్న నేపథ్యంలో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. అలాగే మల్లాపూర్ శివారులో ఎత్తుపల్లాలుగా కాలువ నిర్మాణం చేపట్టడంతో ఒక్క వర్షం వచ్చినా సరే పైనుంచి వరద వచ్చి కాలువపై నుంచి నీళ్లు పొర్లి రైతులను నష్టాల పాలుచేస్తున్నది. నాట్లు వేసిన తర్వాత భారీగా వరదపారడంతో పొలాలు పాడైపోతున్నాయి. కట్టలు కూడా సరైన స్థితిలో పోయకపోవడంతో ఎక్కడికక్కడ నీళ్లు పొర్లిపోతున్నాయి. అధికారులు కాలువకు శాశ్వత మరమ్మతులు చేసి సమస్య పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

మల్లాపూర్ శివారులో డీ4 కెనాల్ ఉపకాలువ నుంచి గత వర్షాకాలం పొంగిపొర్లుతున్న వరద

పరిష్కారానికి చర్యలు తీసుకుంటం

డీ4ఉపకాలువ మరమ్మతుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. గతంలో గండి పడిన చోట మరమ్మతులు చేశాం. మరిన్ని చోట్ల ఇబ్బందులు ఉన్నాయని రైతుల నుంచి వినతులు వస్తున్నాయి. దాన్ని పరిశీలిస్తాం. అనంతరం దాన్ని ఏం చేయాల్లో ప్రణాళిక రూపొందిస్తాం. వర్షాలు పడినప్పుడు పైనుంచి వరద వస్తుండడంతో ఎక్కడ తెగుతుందో అర్థం కాని పరిస్థితి ఉంది. శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

-పెద్ది రమేశ్, ఈఈ

కేంద్రం ఒంటెద్దు పోకడలు మానుకోవాలి

- ఎర్రగుట్ట ఎన్ కౌంటర్‌పై సుప్రీం కోర్టు రిటైర్డ్ జడ్జితో విచారణ జరిపించాలి
- విలేకరుల సమావేశంలో సీపీఐ జాతీయ నేత చాడ వెంకటరెడ్డి

చిగురుమామిడిలో మాట్లాడుతున్న సీపీఐ జాతీయ నేత చాడ

చిగురుమామిడి, మే 25: కేంద్రం ఒంటెద్దు పోకడలను మానుకోవాలని, మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని సీపీఐ జాతీయ నేత వెంకట్ రెడ్డి సూచించారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఎర్రగుట్ట ఎన్‌కౌంటర్‌పై రిటైర్డ్ జడ్జితో విచారణ జరిపించాలని కోరారు. రాష్ట్రంలో స్థానిక ఎన్నికలను నిర్వహించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. గ్రామాలకు నిధులు నిలిచిపోయాయన్నారు. ప్రభుత్వం తక్షణమే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అందె స్వామి, బోయిని అశోక్, మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మీరెడ్డి, సహాయ కార్యదర్శి బూడిద సదాశివ, జిల్లా రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కాంతాల శ్రీనివాస్ రెడ్డి, బోయిని పటేల్, చిన్నస్వామి తదితరులు పాల్గొన్నారు.

మహాసభల కరపత్రం ఆవిష్కరణ

27, 28వ తేదీల్లో కరీంనగన్‌లోని మధు గార్డెన్స్‌లో నిర్వహించే సీపీఐ కరీంనగర్ జిల్లా మహాసభల కరపత్రాన్ని పార్టీ మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మీరెడ్డి, సహాయ కార్యదర్శి బూడిద సదాశివ, నాయకులు ఆదివారం ఆవిష్కరించారు. మహాసభను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా వారు నాయకులను కోరారు.

రైతులకు జీలుగ విత్తనాల కొరత

శంకరపట్నం, మే 25: జీలుగ విత్తనాల కొరతతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మే నెలలో రైతులకు జీలుగ విత్తనాలు సరఫరా కావాల్సి ఉండగా నెలాఖరు వచ్చినా ఇప్పటి వరకు జీలుగ విత్తనాలు సర్కారు అందుబాటులో ఉంచలేదని విమర్శిస్తున్నారు. గతంలో సకాలంలో అందుబాటులోకి వచ్చే జీలుగ విత్తనాలను ఈసారి ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం సింగిల్ విండో సొసైటీల ద్వారా ఇప్పటికైనా మండలానికి సరిపడా జీలుగ విత్తనాలను వెంటనే సరఫరా చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

పొదుపు సంఘం కార్యవర్గం

తిమ్మాపూర్ రూరల్, మే 25: మండలంలోని పోరండ్ల గ్రామంలో ఆదర్శ పురుషుల పొదుపు సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నాగపూరి శ్రీనివాస్ రెండోసారి ఎన్నికయ్యారు. అలాగే ఉపాధ్యక్షుడిగా బొజ్జ కొమురయ్య, డైరెక్టర్లుగా మామిడిపల్లి శ్రీనివాస్, బొజ్జ రాజమౌళి, గడ్డం శ్రీకాంత్, సదిరే సంపత్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు గుంటి వెంకటేశ్, సభ్యులు పాల్గొన్నారు.

బాల్య మిత్రుల ఔదార్యం

- అనారోగ్యం పాలైన స్నేహితుడికి ఆర్థిక సాయం

నర్సయ్యకు నగదు అందజేస్తున్న స్నేహితులు

హుజూరాబాద్ రూరల్, మే 25: మండలంలోని తుమ్మనపల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించిన 1988 బ్యాచ్‌కి చెందిన స్నేహితులు తోటి మిత్రుడి పట్ల ఔదార్యం చాటారు. తుమ్మనపల్లి గ్రామానికి చెందిన నర్సయ్య అనారోగ్యానికి గురై ఆర్థికంగా ఇబ్బందులు పడుతుండగా, స్నేహితులు రూ.26వేలు అప్పటి ప్రధానోపాధ్యాయుడు పాపిరెడ్డి చేతుల మీదుగా ఆదివారం అందజేశారు. స్నేహితుడు ఆపదలో ఉన్నాడని తెలుసుకొని ఆర్థిక సాయం అందజేసిన వారిని గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో నిమ్మల మధుసూదన్‌రెడ్డి, బండారి లక్ష్మయ్య, సత్తయ్య, రత్నమాల, రమాదేవి, రాంరెడ్డి, తిరుపతిరెడ్డి, లింగయ్య, విమల, స్వరూప, హైమావతి, మల్లికార్జున్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

హుజూరాబాద్ వాసికి జాతీయస్థాయి అవార్డు

అవార్డు అందుకున్న ఆడెపు ధీరజ్

హుజూరాబాద్ టౌన్, మే 25: పట్టణానికి చెందిన వ్యాపారి ఆడెపు సూర్యం-సంధ్యారాణి దంపతుల కుమారుడు ధీరజ్ జాతీయస్థాయి గ్రేట్ పీపుల్ మేనేజర్స్ అవార్డు ముంబైలో అందుకున్నారు. గ్రేట్ పీపుల్ మేనేజర్స్ ఆఫ్ ఇండియా దేశవ్యాప్తంగా వందమంది వ్యాపారవేత్తలను ఎంపిక చేసింది. రెండు రోజుల క్రితం ముంబైలో నిర్వహించిన గ్రేట్ మేనేజర్స్ లీగ్ సమ్మిట్- 2025 లో భాగంగా ఆయనకు అవార్డును, సర్టిఫికెట్‌ను అందజేశారు. దేశంలోనే వందమంది వ్యాపారవేత్తల్లో హుజూరాబాద్‌కు చెందిన ధీరజ్ ఎంపిక కావడం జిల్లాకే కాదు రాష్ట్రానికే గర్వకారణమని పలువురు కొనియాడారు. అభినందనలు తెలిపారు.

గంగాధర: లక్ష్మీదేవిపల్లి నరేంద్ర పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

శంకరపట్నం: వంకాయగూడెంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో సమావేశమైన తాడికల్ పాఠశాల 1992-93 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాలు

గంగాధర, మే 25: మండలంలోని లక్ష్మీదేవిపల్లి నరేంద్ర పాఠశాల 2012-13 పదో తరగతి బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు చదువులు చెప్పిన ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు సన్మానించారు. అనాటి తీపి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. సాయంత్రం వరకు ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. ఇక్కడ పాఠశాల యాజమాన్యం గంగాధర రాజేశం, గుజ్జుల గోపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శంకరపట్నం, మే 25: మండలంలోని తాడికల్ గ్రామ జడ్పీ ఉన్నత పాఠశాలలో 1992-93 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం వంకాయగూడెం పరిధిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో కలుసుకున్నారు. ఆటపాటలతో రోజంతా సందడి చేశారు. తమకు చదువు నేర్పిన గురువులు రామయ్య, శ్యాంసుందర్, కాళిదాసు, నాగభూషణం, రాంరెడ్డిని ఘనంగా సత్కరించారు. విందు భోజనాలు ఆరగించారు. ఆనాటి మధుర స్మృతులను మూటగట్టుకుని సాయంత్రం భారంగా ఇంటి దారి పట్టారు.

ప్రయాణికులతో కిక్కిరిసిన బస్టాండ్

బస్సుల కోసం ఎదురు చూస్తున్న ప్రయాణికులు

తెలంగాణచౌక్, మే 25: ఒక వైపు కాళేశ్వరంలో కొనసాగుతున్న సరస్వతీ పుష్కరాలు నేటితో (సోమవారం) ముగియనుండడం, మరోవైపు వారాంతరపు సెలవులు రావడంతో కాళేశ్వరం వెళ్లే భక్తులతో పాటు సెలవుల్లో వివిధ గమ్యస్థానాలకు వెళ్తున్న ప్రయాణికులతో జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్‌స్టేషన్ శనివారం కిక్కిరిసింది. కరీంనగర్ రీజియన్ నుంచి కరీంనగర్, గోదావరిఖని, మంథని నుంచి కాళేశ్వరానికి ప్రతి రోజు 50 బస్సులు నడిపిస్తుండగా, శనివారం ఒక్క రోజే కరీంనగర్ నుంచి 140 బస్సులను ఏర్పాటు చేశారు. ఉమ్మడి కరీంనగర్ గ్రామీణ ప్రాంతాల నుంచి మహిళా ప్రయాణికులు అధిక సంఖ్యలో కాళేశ్వరం నది సాన్నానికి తరలివెళ్లారు. దీంతో నిత్యం నడిచే బస్సులతో పాటు రద్దీ అధికంగా ఉండడంతో అదనంగా పల్లె వెలుగు, ఎక్స్ ప్రెస్, ఈవీ బస్సులను ప్రత్యేకంగా నడిపిస్తున్నారు. కరీంనగర్ బస్టాండ్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కాళేశ్వరం ప్లాట్ ఫారం వద్ద డిపో-2 మేనేజర్ శ్రీనివాస్, డిపో-1 అసిస్టెంట్ డీఎం హిమబిందు, ఏటీఎం సురేశ్, సిబ్బందిని సమన్వయం చేస్తూ రద్దీకి అనుగుణంగా బస్సులను నడిపించారు. ఆర్టీసీ కరీంనగర్ రీజియన్ హాస్పిటల్ మెడికల్ ఆఫీసర్ ఆధ్వర్యంలో కాళేశ్వరం బస్టాండ్ వద్ద మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసి 24 గంటల పాటు వైద్య సేవలను కొనసాగిస్తున్నారు. అత్యవసర సేవల కోసం అంబులెన్స్ అందుబాటులో ఉంచామని మెడికల్ ఆఫీసర్ ఏవీ గిరిసింహారావు తెలిపారు. ఆర్టీసీ సిబ్బందితో పాటు భక్తుల కూడ వైద్య సేవలను అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

తాపాలగుట్ట వద్ద.. గుప్తనిధుల కోసం తవ్వకాలు

గుంత తవ్వుతున్న ఎక్స్‌కవేటర్

తిమ్మాపూర్, మే 25: ఎల్ఎండీ రిజర్వాయర్‌లో ఉన్న శ్రీ తాపాల లక్ష్మీనృసింహ స్వామి గుట్ట చుట్టూ గుప్త నిధుల కోసం కొందరు వ్యక్తులు ఎక్స్‌కవేటర్ సహాయంతో తవ్వకాలు చేపట్టారు. దీంతో రామకృష్ణకాలనీ గ్రామానికి చెందిన రైతుల సమాచారంతో గ్రామస్తులు వెళ్లి సదరు వ్యక్తులను ప్రశ్నించగా, పొంతన లేని సమాధానాలు చెబుతూ గొడవకు దిగారు. తమకు ఇరిగేషన్ అధికారుల అనుమతులున్నాయని ఎదురుతిరిగారు. దీంతో గ్రామస్తులు అధికారులను అడగ్గా.. తామేమీ అనుమతులు ఇవ్వలేదని స్పష్టం చేశారు. గ్రామస్తులు గట్టిగా ప్రశ్నించడంతో అక్కడినుంచి పరారయ్యారు. గుప్త నిధుల కోసమే తవ్వకాలు చేపట్టారని, అధికారులు చర్యలు తీసుకోవాలని రామకృష్ణకాలనీకి చెందిన దావు సంపత్ రెడ్డి, మాచర్ల అంజయ్య, కొమ్మెర మల్లారెడ్డి, పలువురు గ్రామస్తులు అధికారులను కోరారు. ఈ వ్యవహారం వెనుక ఉన్న వారిని బయటకు తీయాలని డిమాండ్ చేశారు.కాగా, దీనిపై ఈఈ నాగభూషణ్‌రావు మాట్లాడుతూ, ఘటనా స్థలాన్ని పరిశీలించామని, బాధ్యులను పట్టుకొని చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఉమ్మడి జిల్లాస్థాయి క్రికెట్ ఎంపిక పోటీలు ప్రారంభం

కరీంనగర్ జట్టులో 73 పరుగులు చేసి విజయంలో కీలకంగా వ్యవహరించిన నితిన్‌రెడ్డి

కొత్తపల్లి, మే 25 : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ఆధ్వర్యంలో కరీంనగర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్(కేడీసీఏ) సహకారంతో ఉమ్మడి జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు ఆదివారం కరీంనగర్‌తో పాటు వేములవాడ పట్టణంలో ప్రారంభమయ్యాయి. కరీంనగర్‌లోని సెయింట్ ఆల్ఫోన్స్ మైదానంలో ప్రారంభమ్యాచ్‌ను కరీంనగర్, పెద్దపల్లి జిల్లాలోని గోదావరిఖని జట్ట మధ్య నిర్వహించగా, కరీంనగర్ జట్టు గోదావరిఖని జట్టు విజయం సాధించింది. శాతవాహన యూనివర్సిటీ మైదానంలో జరిగిన రెండో మ్యాచ్‌లో కరీంనగర్ రూరల్ జట్టు జగిత్యాల జట్టుపై గెలుపొందింది. వేములవాడలో జరిగిన మూడో మ్యాచ్‌లో హుస్నాబాద్ జట్టు వేములవాడ జట్టుపై విజయం సాధించింది. వారం రోజుల పాటు ఈ పోటీలు జరుగనుండగా అత్యుత్తమ క్రీడాకారులను ఎంపిక చేసి రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్టును ఎంపిక చేస్తామని కేడీసీఏ అధ్యక్ష కార్యదర్శులు వీ ఆగంరావు, ఎన్ మురళీధర్‌రావు పేర్కొన్నారు. రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో ఈ క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నారు.

హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక పోటీలకు స్పందన

ఎంపిక పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

కొత్తపల్లి, మే 25 : ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం కొత్తపల్లిలోని అకాడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించిన జూనియర్స్ బాలబాలికల జట్ల ఎంపిక పోటీలకు క్రీడాకారుల నుంచి స్పందన లభించింది. సుమారు 150 మందికి పైగా క్రీడాకారులు ఈ ఎంపిక పోటీల్లో పాల్గొన్నారు. బాల బాలికలకు వేర్వేరుగా ఎంపిక పోటీలు నిర్వహించి ప్రతిభ చాటిన వారిని జూన్ 4 నుంచి 6 వరకు నకిరేకల్‌లో జరిగే 47వ రాష్ట్రస్